మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మాలోత్ కవిత, తుల ఉమ

ఖబర్దార్ బిడ్డా.. నోరు జాగ్రత్త

- సురేఖా.. సంస్కారహీనంగా మాట్లాడొద్దు
- మహిళా మంత్రులను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దాడి
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం
- సురేఖ నోటిని యాసిడ్‌తో కడగాలి
- మాజీ ఎంపీ మాలోత్ కవిత ఫైర్
- నువ్వేమైనా బ్రోకర్‌వా?
- బీఆర్ఎస్ నేత తుల ఉమ ధ్వజం

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ సంస్కారహీనంగా, సినిమా పరిశ్రమను కించపరిచేలా మాట్లాడారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి బజారు భాషపై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఆమె తీరును మహిళలే అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. 'ఖబర్దార్ బిడ్డా? నోరు జాగ్రత్త' అని సురేఖను హెచ్చరించారు. మహిళా మంత్రులను శిఖండిలా అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌పై రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణభవన్‌లో మాజీ ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమతో కలిసి బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. సినిమా పరిశ్రమలో ఉన్న మహిళలను కేటీఆర్‌కు అంటగడతారా? అని నిలదీశారు. ఇట్లాగే మాట్లాడితే కోర్టుకీడుస్తామని హెచ్చరించారు. సినిమాలు నిర్మించిన సురేఖ, సినీ పరిశ్రమ మహిళలపై చులకనగా మాట్లాడటం తగదని హితవుపలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులపై మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇండ్లను కూలుస్తున్నారని, ప్రజలంతా బీఆర్ఎస్ వద్దకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారని, ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేక కేటీఆర్‌పై సురేఖ ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో మానుకోటలో కొండా సురేఖ ఏం మాట్లాడారో అందరికీ తెలుసని, ఆమె వ్యాఖ్యలపై సినిమా ఇండస్ట్రీలో ఉన్న మహిళలు స్పందించాలని కోరారు.అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని సీఎం అసెంబ్లీలో అంటే మహిళా మంత్రులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

ఆమె నోటిని యాసిడ్‌తో కడగాలి: కవిత

కొండా సురేఖ వ్యాఖ్యల పట్ల ఓ మహిళగా తాను సిగ్గుపడుతున్నానని మాజీ ఎంపీ మాలోత్ కవిత తెలిపారు. కుటుంబాల మధ్య చిచ్చు పెడుతున్నారని, మంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నాగార్జున కుటుంబాన్ని, సమంతను ఎన్నిసార్లు రోడ్డున పడేస్తారని ప్రశ్నించారు. సురేఖ నోరును యాసిడ్‌తో కడగాలని విమర్శించారు. కేటీఆర్ గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, ఉరికిచ్చి కొడతామని హెచ్చరించారు. సురేఖపై పరువునష్టం దావా వేస్తామని చెప్పారు. హైడ్రాతో పడిపోతున్న గ్రాఫ్‌ను కాపాడుకోవడం కోసం రేవంత్‌రెడ్డి కొండా సురేఖ, సీతక్కతో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి గాని, కేటీఆర్‌పై మాట్లాడితే.. నాలుక చీరేస్తామని హెచ్చరించారు.

మహిళవై ఉండి మహిళలను కించపరుస్తవా?: తుల ఉమ

'నువ్వేమైనా బ్రోకర్‌వా? ఓ మహిళవై ఉండి సినిమా పరిశ్రమలోని మహిళలను ఎలా కించపరుస్తవ్? ఇతర మహిళల పేర్లు ఎలా ప్రస్తావిస్తవ్?' అని బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ నిలదీశారు. కొండా సురేఖ చరిత్ర అందరికీ తెలుసని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఎవరో కామెంట్ పెడితే దొంగ ఏడుపులు ఎందుకు? దానికి కేటీఆర్‌పై ఆరోపణలు చేయడం ఎందుకు? అని నిలదీశారు. ట్రోల్ చేసిన వారిపై మీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. హైడ్రాతో ఇబ్బంది పడుతున్న ఆడబిడ్డల గోస కొండా సురేఖకు, సీతక్కకు కనిపించడం లేదా? అని నిలదీశారు.

కాంగ్రెస్ ఫాల్స్.. ఫ్లాప్ షో!

- పది నెలలుగా డైవర్షన్ రాజకీయం
- అదే కోవలో కొండా సురేఖ వ్యాఖ్యలు
- సర్కార్‌పై విమర్శలు వస్తే కొత్త వివాదం
- హైడ్రాపై వ్యతిరేకత నుంచి తప్పించుకోబోయి... సెల్ఫ్‌గోల్

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): 'తప్పు చెయ్. దానిని కప్పి పుచ్చుకోవడానికి అంత కన్నా పెద్ద తప్పు చెయ్'– ఇదీ గత పది నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న పాలసీ. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్మాణాత్మక వైఖరిని కాకుండా డైవర్షన్ పాలిటిక్స్‌ను నమ్ముకొని పాలన సాగిస్తున్నారు. ఒక సమస్య వస్తే దానిని కప్పిపుచ్చేందుకు మరో సమస్యను సృష్టిస్తూ గందరగోళంలో ముంచుతున్నారనే విమర్శను ముఖ్యమంత్రి ఎదుర్కొంటున్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమనే వాదన వినిపిస్తున్నది. నిజానికి మంత్రి సురేఖను సోషల్‌మీడియాలో ట్రోల్ చేయడాన్ని మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్ సహా పలువురు నేతలు ఖండించారు. అటువంటి వాటిని వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీ పరంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అయినా, కేటీఆర్ స్పందించలేదంటూ ఆయనపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యల వెనుక డైవర్షన్ పాలిటిక్స్ వ్యూహం దాగి ఉన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

తక్షణ డైవర్షన్‌కు కారణమిదేనా?

మూసీ సుందరీకరణ, హైడ్రా కూల్చివేతలతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. చివరకు పలువురు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా అసహనం వ్యక్తంచేస్తున్నారు. బయట తిరగలేకపోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 'తొందర పడి కూల్చొద్దని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ చెప్తుండగా, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం హైడ్రా అనంతర పరిణామాలపై సీఎం ఒంటెద్దు నిర్ణయాలు పార్టీకి తీవ్ర నష్టం చేస్తాయని ఆంతరంగిక చర్చల్లో అభిప్రాయపడినట్టు సమాచారం. మరోవైపు ప్రజా వ్యతిరేకతపై నివేదికలు అందుకున్న అధిష్ఠానం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుని మొట్టికాయలు వేసిందని గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

కరపత్రం వర్క్‌అవుట్ కాలేదనేనా?

హైడ్రాతో ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ పెద్దల పర్యవేక్షణలో మొన్నటికి మొన్న ఒక ప్రముఖ హీరోయిన్ చేసిన కామెంట్ అంటూ ఒక కరపత్రాన్ని సోషల్ మీడియాలోకి వదిలారు. అది వైరల్ అయినా కావాల్సినంత మైలేజ్ రాలేదు. దీంతో ఈసారి ఏకంగా మహిళా మంత్రినే రంగంలోకి దించి, సినీ కుటుంబాల వ్యక్తిగత వ్యవహారాలను రాజకీయాల్లోకి లాగారనే చర్చ జరుగుతున్నది.

10 నెలలుగా డైవర్షన్ పాలిటిక్స్‌కు సాక్షాలివిగో..

గత సంవత్సరం డిసెంబర్ 7న కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన నాటినుంచి తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల దాకా పది నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

- రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. నిరసనలకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు దిగారు. ఆ తరువాత నటుడు నాగార్జునకు చెందిన 'ఎన్' కన్వేషన్‌ను కూల్చివేశారు.
- బియ్యం కొనుగోలు వ్యవహారంలో రూ.1,100 కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఫోన్‌ట్యాపింగ్ కేసులో లీకులు వదిలి హడావుడి చేశారు. సచివాలయం ఎదురుగా తెలంగాణతల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిని తప్పుబడుతూ తెలంగాణ మేధో సమాజం రాహుల్‌గాంధీకి లేఖ రాసింది.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తన సోదరుడికి చెందిన స్వచ్ఛబయో సంస్థతో కుదుర్చుకున్న రూ.1,000 కోట్ల ఒప్పందం దుమారం రేపింది. వీటినుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా రాజీవ్‌గాంధీ వర్ధంతినాడు సీఎం అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజల దృష్టిని మళ్లించారు.
- రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అసెంబ్లీ సాక్షిగా సర్కార్ వైఫల్యాలను ఎండగడితే, వాటిపై సమాధానం చెప్పాల్సిందిపోయి 'ఆ ఇద్దరు అక్కలను నమ్ముకుంటే బతుకు జూబ్లీ బస్టాండే' అంటూ వ్యాఖ్యానించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడ్డారు.
- విద్యుత్తు కొనుగోళ్లపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా 'మోటర్లకు మీటర్లు పెడ్తామని కేసీఆర్ సర్కార్ సంతకాలు చేసింది' అంటూ అసత్యాలు ప్రచారం చేశారు. సంబంధంలేని పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలోనూ సభను తప్పుదారి పట్టించారు.

సమంతకు వెల్లువెత్తుతున్న మద్దతు

సినీ నటి సమంత విడాకుల విషయంలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సురేఖ వ్యాఖ్యలను ఖండిస్తూ సమంత సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో పార్టీలకు, భావజాలాలకు అతీతంగా పలువురు సెలబ్రిటీలు, సామాజిక ఉద్యమకారులు సమంతకు మద్దతుగా నిలిచారు. సమంతపై మంత్రి చేసిన వ్యాఖ్యలతో మహిళల హక్కులు, వ్యక్తిగత గోప్యతపై చర్చ మొదలైంది. సమంత సొంత రాష్ట్రమైన తమిళనాడులో ఆమె అభిమానులు సోషల్‌మీడియా వేదికగా సురేఖను తిట్టిపోస్తున్నారు. రాజకీయంగా విభేదాలు ఉంటే ప్రతిపక్షాలతో పోరాడాలని, మధ్యలోకి సినీ నటిని తీసుకొచ్చి ఆమె వ్యక్తిత్వ హననానికి పాల్పడమేమిటని ప్రశ్నిస్తున్నారు. 'హైడ్రా, మూసీ కూల్చివేతలపై దృష్టి మళ్లించడం కోసం ఒక మహిళా మంత్రి.. మరో స్టార్ హీరోయిన్ వ్యక్తిగత జీవితంపై నిరాధారమైన ఆరోపణలు చేసి తన బుద్ధి ఎలాంటిదో మీడియా సాక్షిగా ప్రకటించింది' అని టీజీ సెక్రటేరియట్ మీడియా గ్రూప్‌లో విమర్శించారు. 'ఒక మహిళ అయి ఉండి, మరో మహిళ వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల్లో లాగడం సిగ్గుమాలిన చర్య. అమె వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని సుమంతకు క్షమాపణ చెప్పాలి' అని శోభ అనే నెటిజన్ డిమాండ్ చేశారు.

గురి తప్పిన బాణం

కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్టుగా తయారైంది.. కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి. హైడ్రా కూల్చివేతలు, మూసీ విధ్వంసంపై వ్యతిరేకత నుంచి దారి మళ్లించేందుకు చేసిన ప్రయత్నం దేశవ్యాప్త వివాదానికి దారితీసింది. సర్కారు తీరును ప్రశ్నిస్తున్న కేటీఆర్‌ను టార్గెట్ చేస్తే, బాణం గురితప్పి కాంగ్రెస్‌కు గుచ్చుకున్నది. తనను బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో ట్రోల్ చేస్తున్నారంటూ రెండోరోజుల కిందట కంటతడిపెట్టిన కొండా సురేఖ నాటకాన్ని రక్తి కట్టించారు. తాజాగా సమంత వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడటంతో సీన్ రివర్సయింది. సురేఖ తీరు వివాదాస్పదం కావడంతో అధిష్ఠానం సీఎంను వివరణ కోరినట్టు తెలిసింది.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.3°c	23.5°c
మెదక్	39.2°c	20.8°c
ఖమ్మం	35.0°c	26.0°c
హైదరాబాద్	33.0°c	23.0°c
రంగారెడ్డి	32.4°c	24.2°c
కరీంనగర్	32.0°c	26.0°c
వరంగల్	32.0°c	26.0°c
నల్లగొండ	31.5°c	24.4°c
మహబూబ్‌నగర్	31.0°c	23.0°c
నిజామాబాద్	30.4°c	24.3°c

సురేఖ వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం

వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని రాజకీయ, సినీ ప్రముఖుల డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని భేషరతుగా క్షమాపణ చెప్పాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తున్నది. కేటీఆర్‌పై ఆమె చేసిన వ్యాఖ్యలపై ఓవైపు గులాబీ శ్రేణులు మండిపడుతుండగా మరోవైపు సినీ ప్రముఖులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

భేషరతుగా క్షమాపణ చెప్పాలి: హరీశ్‌రావు

కేటీఆర్‌కు మంత్రి కొండా సురేఖ భేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆమె వ్యాఖ్యలను ఎక్స్‌వేదిగా ఖండించారు. 'వారి వద్ద సరైన సమాధానం లేనప్పుడే వ్యక్తిగత దూషణలకు దిగుతారు' అనే మార్గరెట్ థాచర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కోట్ చేశారు.

ఇవేం వ్యాఖ్యలు: ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

రాష్ట్రమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఓ ప్రముఖ నటి వ్యక్తిగత జీవితాన్ని ఇలా బజారుకీడ్చేలా మాట్లాడితే ఎలా? అని మంత్రి కొండా సురేఖను ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'ఆ సంగతి ఎవరు చెప్పారు? వాళ్ల విడాకుల పత్రంలో ఆ వివరాలున్నాయా?' అని ప్రశ్నించారు. 'ఎవరో ముక్కూముఖం తెలియని వాళ్లు ఏదో రాశారని బాధపడ్డారు. ఆ బాధ సహజమే. కానీ, సాటి మహిళలను మీరే గౌరవించనప్పుడు అదే గౌరవాన్ని ఆశించటం అత్యాశే కదా!' అని పేర్కొన్నారు. ఎవరో గిట్టని వాళ్లు కాదు స్వయంగా కాంగ్రెస్ వాళ్లే ప్రచారం చేయటం ఆశ్చర్యంగా ఉన్నదని, మహిళల శీలహననం ఎవరు చేసినా తప్పేనని స్పష్టంచేశారు. 'అధికార బాధ్యతల్లో ఉండి ఆదర్శంగా ఉండాల్సిన వాళ్లు ఏది మాట్లాడినా ఎదురు మాట్లాడవద్దు అంటే కుదరదు' అని తేల్చిచెప్పారు.

ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి: దేవీప్రసాద్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్

కేటీఆర్‌పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని మహిళా సమాజానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలి. సినీ రంగంలో ఉన్న మహిళా నటులపై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలపై సినీరంగ పెద్దలు స్పందించాలి. మూసీ, హైడ్రా వల్ల వచ్చిన ప్రజా వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చేస్తున్న ఈ హైడ్రామాను ప్రజలంతా గమనిస్తున్నారు. ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి.

తోటి మహిళ పై హేయమైన వ్యాఖ్యలా?

సమంత, నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు హేయం. మంత్రి ఒక మహిళ అయి ఉండి తోటి మహిళపై హేయమైన వ్యాఖ్యలు చేయడం అభ్యంతరకరం. అక్కినేని కుటుంబంపై, సుమంతపై చేసిన జుగుప్సాకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. నిరాధారమైన ఆరోపణలు, వ్యాఖ్యలు చేయడం నీచమైన రాజకీయాలకు పరాకాష్ఠ. సురేఖపై పెట్టిన అభ్యంతరకర పోస్టులను సమాజం వ్యతిరేకించింది. దీన్ని ఆసరా చేసుకొని తోటి మహిళపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి ఆమెకు మనసెలా వచ్చింది. రాజకీయ వివాదాల్లోకి సంబంధంలేని మహిళను తీసుకురావడం దుర్మార్గం. ఆ పనిని మహిళే చేయడం మరింత బాధిస్తున్నది. ఇలాంటి వేదనాభరిత పరిస్థితి నుంచి అక్కినేని కుటుంబం, సమంత మనోధైర్యంతో అధిగమిస్తారని ఆశిస్తున్నా.

– రోజా సెల్వమణి, ఏపీ మాజీ మంత్రి

మూసీని మించి కాంగ్రెస్ కంపు

మొదటిపేజీ తరువాయి...

కుటుంబంలోకానీ, ఇటు కేటీఆర్ కుటుంబంలో మహిళలే లేనట్టు అత్యంత హీనంగా ఆమె మాట్లాడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూసీపాలైన రేవంత్ సర్కారు పరువు

కొండా సురేఖ వ్యాఖ్యలతో జాతీయస్థాయిలో కాంగ్రెస్ పరువు పోయింది. ఇప్పటికే మూసీ కూల్చివేతలతో జాతీయస్థాయిలో అపఖ్యాతిని మూటగట్టుకున్న రేవంత్ సర్కార్.. సురేఖ వ్యాఖ్యలు మరింత పరువును పోగొట్టుకున్నది. పదేండ్లు హుందాగా నడిచిన తెలంగాణ రాజకీయాల్లో.. గత పదినెలలుగా అభ్యంతరకర వ్యాఖ్యలు, జుగుప్సాకర భాష నిత్యకృత్యమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల నోటినుంచే అసహ్యాకర వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చట్టసభల్లోనూ చవకబారు మాటలు వినిపించాయి. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో రౌడీమూకల దాడుల సంస్కృతి, రాజకీయ హింస మొదలైంది. ప్రజాజీవితంలో ఉండీ, ప్రభుత్వ వైఫల్యాలను ధీటుగా ఎదుర్కొంటున్న బీఆర్ఎస్, కేటీఆర్ తదితర నేతలే లక్ష్యంగా ఈ వ్యక్తిగత దాడులు ప్రధానంగా కొనసాగాయి. వాటిలో మరీ దిగజారుడుగా కొండా సురేఖ వ్యాఖ్యలున్నాయి. మంత్రి వ్యాఖ్యలపై సభ్యసమాజం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంటే.. కొన్ని చానళ్లు మాత్రం కనీస ప్రమాణాలు పాటించకుండా ఆ వ్యాఖ్యల్ని అలాగే ప్రసారం చేశాయి. ఇదేం నీతిమాలిన జర్నలిజం? ఇవేం పాత్రికేయ ప్రమాణాలు?

హైకమాండ్ మందలింపు

సినీ హీరోయిన్లు, నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా తెలిసింది. ఈ విషయం తెలియడంతోనే అధిష్ఠానం పెద్ద ఒకరు నేరుగా కొండా సురేఖకు, పీసీసీ కీలక నేతకు ఫోన్ చేసి తీవ్రస్థాయిలో మందలించినట్టుగా సమాచారం. ఇప్పటికే మూసీ, హైడ్రాతో పార్టీని నాశనం చేస్తున్నారని, ఇది సరిపోనట్టుగా ఇప్పుడు సినీ ఇండస్ట్రీని కూడా పార్టీకి దూరం చేస్తారా.. ప్రజల్లో పార్టీని పలుచన చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఈ వివాదాలతో అసలు పార్టీని ఏం చేయదలుచుకున్నారో చెప్పాలని నిలదీసినట్టుగా తెలిసింది. ఒక మహిళా మంత్రి అయి ఉండి..సాటి మహిళలపై అంత అసభ్యకరంగా, సంస్కారరహితంగా మాట్లాడటమేమిటని ప్రశ్నించారని, వ్యక్తిత్వంలేని వాళ్లను కేబినెట్‌లోకి ఎలా తీసుకున్నారని మండిపడ్డారని సమాచారం.

కొండా సురేఖ మెంటల్ హాస్పిటల్‌లో చేరాలె

- అక్కా నీ మానసిక పరిస్థితి బాగాలేదు
- అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా?
- నువ్వేం దేవాదాయ శాఖ మంత్రివి?
- కొండాపై అక్కినేని అభిమానుల ఆగ్రహం
- సోషల్‌మీడియాలో కాంగ్రెస్‌పై చెడుగుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సినీ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను అక్కినేని అభిమానులు తీవ్రంగా వ్యతిరేకించారు. రాజకీయాల్లో రాణించడానికి ఇంత దిగజారుతావా? నువ్వేం దేవదాయ శాఖ మంత్రివి? అంటూ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నువ్వు దేవాదాయశాఖ మంత్రిగా ఉండటం మా దురదృష్టం' అంటూ ధ్వజమెత్తారు. 'అక్కా నీ మానసిక పరిస్థితి బాగాలేదు. వెంటనే మీరు మెంటల్ హాస్పిటల్‌లో చేరండి' అంటూ దాడికుమార్ అనే నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి వెంటనే తొలిగించాలని భగవంత్ రావు అనే నెటిజన్ డిమాండ్ చేశారు. 'చీ నువ్వు మినిస్టర్ ఎట్ల అయినవ్' అంటూ అనిల్ కుమార్ విమర్శించారు. 'పతివ్రత పరమాన్నం వండితే తెల్లారేదాక చల్లారలేదు అంట. విలువల గురించి కొండా సురేఖ మట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టే. ఆమె భర్త మహిళా కార్పొరేటర్లను గెస్ట్ హౌస్‌లకు తీసుకునిపోయేవారు. ఈ ఘనకార్యాలన్నీ న్యూస్‌పేపర్లో వచ్చినవే' అని వరుణ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నెటిజన్ వాట్ ఆర్ ద ఆడ్స్ అకౌంట్‌తో 'కొండా ఈజ్ ద బిగ్గెస్ట్ పొలిటికల్ క్రిమినల్ ఆఫ్ తెలంగాణ. షేమ్ ఆన్ హర్' అంటూ తీవ్రంగా స్పందించారు.

సినిమావాళ్లను ఏపీకి తరలించే కుట్ర

'చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి సినిమావాళ్లను ఏపీకి తరలించడానికి చేస్తున్న పెద్ద కుట్ర' అని నెటిజన్ ఆకుల సాయి తేజ తన పోస్టులో రాసుకొచ్చారు. మరో నెటిజన్ ఎస్ఎస్ పోస్ట్‌లో కొండా గారు అన్నం తింటున్నారా? గడ్డి తింటున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సబిత అనే నెటిజన్ స్పందిస్తూ..'ఒక ఆడదానివై ఉండి మహిళను కించపరిచేలా వ్యాఖ్యలు ఎలా చేయాలనిపించింది? మీరు కూడా అవే పనులు చేశారా?' అని మండిపడ్డారు.

మీడియా విచక్షణ కోల్పోయిందా?

టీఆర్పీ రేటింగ్ కోసం పోటీలు పడి ప్రసారం • మంత్రి సురేఖ వ్యాఖ్యల ప్రసారంపై విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మీడియా విచక్షణ కోల్పోయింది. టీఆర్పీ రేటింగ్ కోసం రెచ్చిపోయింది. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల మాయలో పడి ఏది పడితే అది ప్రసారం చేస్తున్నదనే విమర్శలను నిజం చేసింది. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో దుమారం రేపుతున్నాయి. ఆమె వ్యాఖ్యలను ఎలక్ట్రానిక్ మీడియా యథాతథంగా ప్రసారం చేసింది. కొన్ని టీవీ చానళ్లు పోటీపడి బ్రేకింగ్ న్యూస్‌గా ప్రసారం చేశాయి. కొండా సురేఖ మహిళ అయితే.. సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్ మహిళలు కారా? ఒక సంచలనం కోసం మరో సంచలనాన్ని పావుగా వాడుకోవచ్చా? అన్న ఇంగితాన్ని మరచి మీడియా ప్రసారం చేసింది. ఏ విషయంలోనూ స్పందించని సినీ పరిశ్రమ ఈ విషయంలో స్పందించింది. మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది.

కేటీఆర్ లీగల్ నోటీసులు

- రాజకీయ కక్షకు నా పేరు వాడుతున్నరు
- సినిమా నటుల పేరును వాడి వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నరు
- 24 గంటల్లోగా సురేఖ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తా
- కిమినల్ కేసులను కూడా పెడతా
- కొండాకు పంపిన నోటీసులో కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా చేసిన వ్యాఖ్యల పట్ల 24 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంత్రి కొండా సురేఖకు బుధవారం లీగల్ నోటీసు పంపారు. క్షమాపణ చెప్పని పక్షంలో చట్టప్రకారం పరువు నష్టం దావా వేయడంతోపాటు క్రిమినల్ కేసులు పెడతానని హెచ్చరించారు. తాను మంత్రిగా ఉన్న కాలంలో ఫోన్ ట్యాపింగ్ చేశానని, నాగచైతన్య–సమంత విడిపోవడానికి ప్రధాన కారణం తానేనని, కొన్ని దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేశారని, గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగించాలన్న లక్ష్యంగానే అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసులో పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతో, రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును సురేఖ వాడుకుంటున్నారని తెలిపారు. సినిమా నటుల పేరును వాడుకొని వారి వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడటం దురదృష్టకరం అని వెల్లడించారు. అసలు తనకు సంబంధమే లేని ఫోన్ ట్యాపింగ్, ఇతర అంశాలపై సురేఖ చేసిన వ్యాఖ్యలు అసత్యపూరితమని అన్నారు. ఎలాంటి సాక్ష్యాధారాలు చూపించకుండా అడ్డగోలుగా మాట్లాడిన సురేఖ ఒక మంత